# కొత్త రచయితలు

**అది డిసెంబర్ నెల**
**వాతావరణం చల్లగా వుంది. ఎటు చూసినా దట్టమైన పొగ మంచు ఆవరించుకొని వుంది.**
**చిన్న చిన్న మంచు బిందువులతో పచ్చని పచ్చిక బయళ్ళు సూర్యకిరణాల కోసం ఎదురు చూస్తూ వున్నాయి.**

## లవ్ స్టోరి రెండో ఓటమి

"ఈ వాతావరణం మాకు మామూలే" అన్నట్టు అటు ఇటు వూగుతున్నాయి రోడ్డుకు రెండు వైపుల అంటిపెట్టుకున్న చెట్లు.

ఎంత చలి వున్నా రోజూ ఠంచనుగా వచ్చే నేను ఆ రోజు కొంత లేటుగా వచ్చాను. నేను ఆఫీసుకు 6 గంటలకు బయలుదేరితే గాని 9 గంటలకు చేరుకోలేను. అందువల్ల మామూలుగా అయిదున్నరకే వచ్చేవాడ్ని. ఈ రోజు రావడం లేటవడం మూలానా నా స్వప్న సుందరిని చూడలేకపోయా. ఎందుకో నాకు చాలా బాధగా వుంది.

ఒక నెల క్రితం అనుకుంటా – మొట్టమొదటిసారిగా ఆ అమ్మాయిని చూశాను. ఇచ్చితంగా రోజూ పొద్దుటక్కువ ఆరుగంటలకు జాగింగ్ చేస్తూ వస్తుంది. ఆ రూపం నేను నా జన్మలో చూసి ఎరగను.

పెద్ద పెద్ద చేరడేసి కళ్ళతో, అందమైన సూటి ముక్కుతో, చిన్ని చిన్ని పెదాలతో, ఎర్రని ఎరుపైన బుగ్గలతో- అబ్బా! ఎంత అందంగా వుందో.

నేను హైదరాబాద్ రావడం మూడు నెలల క్రితమైనా ఆమెను చూడటం అదే ప్రథమం. నా మొట్టమొదటి ఉద్యోగం ఇదే. ఇంజనీర్ని. ఇన్ని రోజులూ చదువు మీద శ్రద్ధ వల్ల నాలోని భావాలు వయసు_వెలరేగడమనేది అట్టే జరగలేదు. ఈ అమ్మాయిని చూస్తే మాత్రం ప్రపంచం అంతా ఒక్కటైనా ఆమెను నా దానిగా చేసుకోవాలనిపిస్తుంది.

నేను ఆమెను రోజూ చూస్తాను. ప్రతిరోజూ నేను ఆమెను చూస్తున్నట్టు ఆమెకు తెలుసు. ఎందుకో మరి నన్ను చూడగానే ఆమె పెదవి మీదకు చిరునవ్వు వచ్చేస్తుంది. ఆ చిరునవ్వులో ఎన్నో అర్థాలు గోచరిస్తాయి. నేను ఆమెను ఎన్నడూ పలుకరించలేదు. ప్రతిరోజూ ఆమె చిరునవ్వుకు నేను చిరునవ్వునే బదులిస్తా.

ఆమెకు నా మనసులోని మాట చెప్పాలని ఎంతో ప్రయత్నించా. ఆమెకు చెప్పడానికి నాకు మాట రాదు. ఒకవేళ నేను మాటాడినా ఆమెకు వినడానికి సమయం లేనట్లు వుంటుందామె ధోరణి. రోజూ నన్ను చూస్తూ చిరునవ్వుతో చూస్తూనే కొంచెం కూడా ఆగదు – పరిగెడుతూనే వుంటుంది.

నా ప్రేమను ఆమెకు తెలియజేయడానికి ఒక వుపాయం ఆలోచించాను. చాలా కాగితాలు చించాక చివరికి

"ప్రియమైన మీకు

సంబోధన విచిత్రంగా వుంది కదండీ! నాకు మీరు తెలుసు కాని మీ పేరు తెలియక అలా వ్రాశా. నెల రోజులుగా నేను మిమ్మల్ని చూస్తున్నా. మిమ్మల్ని చూసినప్పటి నుండి నా మనసును పోగొట్టుకొన్నాను. అది ప్రేమో లేక ఆకర్షణో నాకు తెలియదు. కాని నేను మిమ్మల్ని నా మనసు గుడిలో దేవతగా ఆరాధిస్తున్నాను.

ఇకపోతే, 'మిమ్మల్ని నేను చేసుకోవడానికి మీకున్న ప్రత్యేక అర్హతలు ఏమిటి' అని మీరు అడగవచ్చు. నా పేరు 'సుందర్' (అంత సుందరంగా వుండనేమో) నేను ఇక్కడ రోడ్లు రహదారుల శాఖలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నా. నాకు ఏ బాదర బందీలూ లేవు.

మీకు ఇష్టమైతే, రేపు ఇదే చోట (నా మామూలు స్థలంలో) మీ కోసం చూస్తుంటా. రిప్లై ఇవ్వండి. రిప్లై అంటే మీకు నా సాహచర్యం ఇష్టమైతే బ్లూ డ్రెస్‌లో ........ లేకపోతే గ్రీన్ డ్రెస్‌లో జాగింగ్‌కు రండి.

మీరు ఒప్పుకుంటే ఓ.కే. మీకు ఇష్టం లేకపోతే దీన్ని వెర్రివాడి వుత్తరంగా భావించి చించేయండి. అంతేకాని రోజూ మీరు చిందించే చిరునవ్వును మాత్రం దూరం చేయకండి.

మీ నుండి రిప్లై పాజిటివ్‌గా వస్తుందని ఆశిస్తూ ....

మీ సుందర్

రాయడానికి రాశాను కాని ఆమెకు ఇవ్వడానికి ధైర్యం లేక కొట్టుమిట్టాడుతూ వున్నాను. చివరికి ధైర్యం పోగుచేసుకుని ఒకరోజు ముందుగానే ఆమె కోసం చూస్తూ నిలబడ్డాను.

మెరుపులా నా హృదయరాణి పరిగెత్తుతూ వస్తూ వుంది. అంత దూరంలోనే ఆమె పెదవులపై చిరునవ్వు తళుకు మంటోంది. 'నిన్న ఎందుకు రాలేద'న్నట్టు ఆ చూపులు. నవ్వినప్పుడు తళుకుమనే తెల్లని పళ్ళు. నన్ను నేను మరిచిపోయా. ఇక లేఖ సంగతే స్పృహ లేదు. ఆమె అంత దూరం వెళ్ళిపోయిన తరువాత గుర్తు వచ్చింది. గులాబీరంగు కవర్ నా చేతిలోనే వుంది. నా మందబుద్ధికి నాకే నవ్వు వచ్చింది.

మరుసటి రోజు ఆమె పరిగెడుతూ వస్తూ వుంటే నేను ఒక రెండు అడుగులు ముందుకు వేశా! ఆమె నాకు చాలా దగ్గరగా వచ్చేసింది. ఆగమన్నట్టు సైగ చేశా. ఒకసారి వులికిపడి తనను కాదేమోనని వెనక్కు తిరిగి చూసి "నన్నేనా?" అంది. ఔనన్నట్టు తలూపాను.


రచయిత చిరునామా:
**బి.వి.సతీష్‌కుమార్**
అమృత మెస్ దగ్గర
అమీర్‌పేట
హైదరాబాద్ 500 016



కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్



ఒక నిమిషం సేపు ఆగి చూపులతోనే ప్రశ్నించింది. ధైర్యం కూడగట్టుకుని చేతిలోని కవరును ఆమెకిచ్చాను. మొదట నుదురు చిట్లించినా ఒక్క క్షణం ఆలోచించి తీసుకుంది. ఒక చిరునవ్వు విసిరి మళ్ళీ అలానే పరిగెడుతూ వెళ్ళిపోయింది. ఆ మాత్రానికే పరవశించాను.

నేను ఎదురుచూస్తున్న మరునటిరోజు రానే వచ్చింది. నాలో ఎంతో ఉత్కంఠ. రిజల్టు కోసం ఎదురుచూసే విద్యార్థిలా టెన్షన్‌తో వణకడం నాకే తెలుస్తోంది. దూరంగా ఆమె. కాని నేను ఆశపడ్డట్టు బ్లూ డ్రెస్ కాని, నన్ను నిరాశ పరచడానికి గ్రీన్ డ్రెస్ కాని ధరించి లేదు. రోజ్ కలర్ డ్రెస్! చేతిలో లేత నీలి రంగు కవరు. ఎందుకో చావుబ్రతుకుల మధ్య వున్న మనిషి వలె వుంది నా పరిస్థితి.

ముఖంలో అదే చిరునవ్వు. వేగంతో వస్తున్న లారీకి బ్రేకులు వేసినట్టు ఆకస్మాత్తుగా ఆగిపోయింది. చిరునవ్వుతోనే కలర్ కవర్ నా చేతిలో వుంచేసి అదే వేగంతో వెళ్ళిపోయింది. గబగబ ఆ కవర్ చించాను. ఆమె అందంలా ఆ అక్షరాలూ అద్భుతంగా వున్నాయి.

సుందర్‌గారికి,

మీ పేరు చెప్పారుగా. మరి నా పేరు వీణ. బహుశా నా డ్రెస్‌తోనే మీరు నా మనసును అర్థం చేసుకుని వుంటారు. అంటే నేను

మిమ్మల్ని తిరస్కరిస్తున్నాననీ కాదు, ఇష్టపడుతున్నాననీ కాదు. మీలాంటి సుందరమైన ఇంజనీర్‌గారికి ఈ లోకంలో అందమైన అమ్మాయిలే తక్కువయ్యారా?!

నా మనసులోని మాట కోసం ఎదురుచూస్తున్నారా! సారీనండీ! నాకు మొన్ననే మ్యారేజ్ ఫిక్స్ అయింది. నాకు మొదటిసారిగా మిమ్మల్ని చూడగానే ఎందుకో మీతో స్నేహం చేయాలనిపించింది. అందుకేనేమో మిమ్మల్ని చూడగానే చిరునవ్వు వచ్చేస్తుంది. (మీరు కోరినట్లే ఎప్పటికీ నా చిరునవ్వును దూరం చేయనులెండి) మీ మనసును అల్లకల్లోలం చేసినందుకు అయామ్ సారీ. మరి వుండనా –

మీ నేస్తం వీణ

నా మనసు ఎందుకో ఒకపక్క బాధగాను, ఆమె నన్ను పూర్తిగా నెగటివ్‌గా చూడనందుకు మరోపక్క సంతోషంగానూ వుంది. అంత మాత్రం రిప్లై ఇచ్చినందుకే నాకు ఎంతో ఆశ్చర్యంగా వుంది కూడా. అలానే ఎగుడుదిగుడు మనసుతో ఆఫీసుకు వెళ్ళిపోయాను. అంతే ఇక్కడితో మా కథ ఆగలేదు.

పది రోజులు గడిచిపోయాయి. రోజూ ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించడం, అలానే జాగింగ్‌కు వెళ్ళడం జరుగుతున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఆఫీసు నుండి బస్సు దిగి ఇంటికి వెడుతున్నాను. అంతలో ఎవరో ఆక్సిడెంట్ అయిందని మాట్లాడుకొంటున్నారు. ఎందుకో నా మనసు కీడు శంకించింది. "ఆక్సిడెంట్ ఎక్కడ జరిగింది?" అని ప్రశ్నించాను వాళ్ళలో ఒకరిని.

"ప్రొద్దునే ఒక అమ్మాయిని లారీ గుద్దేసింది. ఎక్కడో కాదు. కొద్ది దూరంలోనే" అంటూ గుర్తులు చెబుతున్నాడు.

"ఆ అమ్మాయి ఎవరో మీకేమైనా తెలుసా?" అంటూ ఇంకొక అతన్ని అడిగాను.

"పేరు తెలియదు కాని సార్ ఆ అమ్మాయిని గాంధీ హాస్పిటల్‌లో చేర్పించారట. ఆ చేర్పించినతను మా స్నేహితుడే" అంటూ స్నేహితుడి గొప్పతనాన్ని పొగిడాడు.

వెంటనే గాంధీ హాస్పిటల్‌కి వెళ్ళాను. అంత పెద్ద హాస్పిటల్‌లో వాకబు చేసి చేసి చివరకు యాక్సిడెంట్ కేస్ ఎక్కడ వున్నదో కనుక్కొని అటు నడిచాను. నేను భయపడిందే నిజం– వీణను చూస్తూనే నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె రెండుకాళ్ళకు పెద్ద బ్యాండేజీలు. ఇంకా స్పృహ రాలేదు. రోజా నవ్వే ఆ చిన్ని పెదవులు జీవం లేనట్లు పాలిపోయాయి. రెపరెపలాడే కళ్ళు నిశ్చలంగా వాలివున్నాయి. ఆ క్షణం దేవుడనే వాడి మీద చాలా కోపం వచ్చింది. గాలిలో ఎగిరే స్వేచ్ఛా విహంగాన్ని రాయితో కొట్టినట్టు ఆమెకు ఆక్సిడెంట్ అయింది.

ఆమె పక్కనే వాళ్ళ అమ్మ అనుకుంటా – కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, స్పృహ రావడానికి సపర్యలు చేస్తూ వుంది. ఆమె నన్ను గమనించే స్థితిలోనే లేదు. ఏదో సణుగుతూ ఏడుస్తూ కొంగుతో ఆమెకు విసురుతూ వుంది. నా అనుమతి లేకుండానే కన్నీరు బయటకు దూసుకువస్తుంటే ఇక అక్కడ వుండలేక బయటకు వచ్చేశాను. ఆ తరువాత రెండు రోజులకు హాస్పిటల్‌కి వెళ్ళాను. నేరుగా వీణను చూసేముందు వార్డు నర్సుని కలిసి వీణ గురించి అడిగాను. ఆమెకు కాళ్ళు శాశ్వతంగా పనికిరాకుండా పోయాయని చెప్పేసరికి నా గుండె తరుక్కుపోయింది. వెడుతూ వెడుతూ నర్సు ఇంకొక పిడుగులాంటి వార్తను చెప్పింది. వీణకు కుదిరిన సంబంధం ఈ కారణంగా తప్పిపోయిందని!

నాకు చాలా బాధ కల్గింది. నేను ప్రేమించి, అభిమానించే వీణకు అలాంటి పరిస్థితి కల్గినందుకు, వీటన్నింటినీ మించి ఆమె పెళ్ళి సంబంధం తప్పిపోయినందుకు ఎంతో విచారించాను. అల్లకల్లోలమైన మనసుతో వార్డులోకి వెళ్ళాను. అప్పటికి వీణ తల్లిని అనునయిస్తున్నట్టు ఏదో మెల్లిగా మాట్లాడుతూంది. నన్ను చూస్తూనే బాధనంత ప్రక్కకు నెట్టి చిరునవ్వుతో ఆహ్వానించింది. దాదాపు ఒక గంటసేపు కూర్చుని మాట్లాడాను.

ఆమె మాటల్లో ఆ బాధంతా గుప్తంగా వుంది. తనకు ఇక వివాహం కాదని తెలిసినట్లు ఆమె మాటలే చెబుతున్నాయి. అంతకు ముందే నేను ప్రిపేర్ అయి వచ్చిన మాటలను ఆమెకు ఒప్పచెప్తున్నట్టు చెప్పాను – "ఎవరు ఏమన్నా, ఎవరు అడ్డుపడినా నేను మిమ్మల్ని వివాహం చేసుకొంటాను" అని!

ఆమె ఒకసారి నవ్వి, "ఎందుకండీ నా మీద మీకంత ప్రేమ?"

"నేను చూసిన తొలి గులాబి మీరు! నేను ఎప్పటికి మిమ్మల్ని పెళ్ళాడేందుకు సిద్ధమే" అన్నాను.

దానికి ఆమె "మరి నేను ఇష్టపడనక్కరలేదా!" అంది.

"ఈ విషయంలో మీరు నన్ను అర్థం చేసుకుని నా ఆలోచనను ఒప్పుకుంటారని నేను అనుకుంటున్నాను" అంటూ నేను బయటకు వచ్చేశాను.

రెండో రోజులు ఆమెకు దూరంగా వున్నాను. మూడవ రోజున నాకు ఆమె నుండి ఒక ఉత్తరం వచ్చింది. అది గ్రీన్ సిగ్నల్ అనుకొని సంతోషంతో చించి చదువసాగాను.

సుందర్‌గారికి,

మీరు నన్ను వివాహం చేసుకుంటానని అనగానే నేను ఒప్పుకుంటానని అనుకున్నారు కదూ! సారీనండీ. ఈ విషయంలో నేను మిమ్మల్ని రెండవసారి నిరుత్సాహపరిచానేమో!

వివాహం విషయంలో నాకు మీ జాలి, దయ వద్దండి. ఎల్లకాలం అభిమానించే మీ ప్రేమ కావాలి. ఇప్పటికే కాళ్ళు లేని నేను మా ఇంటిలోనే అందరికీ భారమైపోయానేమో! అలాంటిది మిమ్మల్ని పెళ్ళి చేసుకొని మీకు జీవితాంతం భారం కాలేను.

ఏ ఒక్కరోజైనా మీరు నాపై విసుక్కోవచ్చు. నేను అలాంటి తిరస్కారాన్ని భరించలేను – ముఖ్యంగా ఇంత ఆత్మీయంగా మసలుకునే మీ నుంచి జీవించినంత కాలం మీ స్నేహం, మీ ప్రేమ, ఆత్మీయతలు నన్ను ఎప్పుడూ నవ్వుతూనే పలకరించాలి. నేను ఇక వివాహం అంటూ ఎవర్నీ చేసుకోను. ఈ ప్రపంచంలో నా అనే వాళ్ళు ఎంతమంది వున్నా, మీలా నిష్కల్మషంగా అభిమానించే వాళ్ళు ఏ ఒక్కరున్నా జీవితం మధురంగా గడిచిపోతుంది.

నన్ను మరొక్కసారి క్షమించండి.

మీ అభిమానం కోసం పరితపించే వీణ

చదువుతుండగనే నా కంటి నుండి ఒక అశ్రువు కాగితంపై పడి ఇంకిపోయింది. ★

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్